RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 270 పేజీలు - 08 మంగళవారం 25 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం**

**ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి**

**అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన**

**ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి**




తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 24: అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు.

మిగతా 2లో...




## స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**ఏలూరు జిల్లా ముసునూరులో కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి**



**ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు**

**రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు**


**రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్**

**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం**

తొలి అక్షరం/ఏలూరు ఆగస్టు 24: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు మిగతా 2లో...

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**




తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి

మిగతా 2లో...


## శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి**

**బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి**

**శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్**

తొలి అక్షరం/హైదరాబాద్, 24: ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానీటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక మిగతా 2లో...



## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**ఏపీలో స్థానిక ఎన్నికలంటూ ప్రచారం.. ఎస్ఈసీ హెచ్చరిక**

**సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఫేక్ అని వెల్లడి**

**అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రజలకు ఎన్నికల సంఘం సూచన**

**100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం**

**కొత్తగా 33.33 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన**

తొలి అక్షరం/అమరావతి 24: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఈ ఫేక్ షెడ్యూల్‌ను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠినమైన సైబర్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని మిగతా 2లో...






2లో.

## ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ**

**రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం**

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**




తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 24: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను మిగతా 2లో...

## పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం**

**జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**


**‹96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**

**తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**

**పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**

**లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

2లో.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.




ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**


సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాధమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ఎస్‌సి వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**తొలి అక్షరం/అమరావతి ఆగస్టు 24:**

జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళు తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ



చూపలేదు. చేపట్టిన పనుల్లో కడా నాణ్యత లేదు. కటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కడా దాదాపు తుది దశకు చేరింది. కటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**మొదటిపేజీ తరువాయి**

టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా




అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ అధికారిక చిహ్నాలు, లోగోలను దుర్వినియోగం చేసి కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ నకిలీ షెడ్యూల్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని పునేఠా తెలిపారు. ఈ షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ తమ కార్యాలయానికి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అధికారిక పత్రికా ప్రకటనల ద్వారా లేదా మీడియా సమావేశాల ద్వారా మాత్రమే వెల్లడిస్తామని, ప్రజలు అనధికారిక వార్తలను ఏమాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆగస్టు 19న జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల మరో 23 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. త్వరలోనే అధికారికంగా షెడ్యూల్ విడుదల చేస్తామని, అప్పటివరకు వదంతులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటిపేజీ తరువాయి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.

ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# ఫీజు బకాయిల రగడ..

### హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 24:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**

రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 24:**



రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

# ప్రజల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యం

**- చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ సీఐ జి. మన్నధ కుమార్.**



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగస్టు 24:** చౌటుప్పల్: ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు చౌటుప్పల్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ సీఐ జి. మన్నధ కుమార్ తెలిపారు.ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని, నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు.చట్టాన్ని గౌరవించడం, నేరాలను నివారించడం, సమాజ శాంతికి సహకరించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వహించాలని సీఐ మన్నధ కుమార్ కోరారు."మీ సహకారంతోనే.. నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యం" అనే సందేశంతో ప్రజలుపోలీసుల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

# రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**- బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్‌లో రక్తదాన శిబిరం**

**దాతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన డాక్టర్ చంద్రశేఖర్**





**తొలి అక్షరం/చౌటుప్పల్. ఆగస్టు 24:** చౌటుప్పల్: పట్టణంలోని కొండూరు రోడ్ బీసీ కాలనీ 10వ వార్డులోని బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి D.A.S. RMO డాక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు.ప్రకాశమణి 19వ పుణ్య స్మృతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, దాదీగారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ధ్యానం నిర్వహించి రక్తదాతలను అభినందిస్తూ Certificate of Appreciationలను అందజేశారు. బీసీ కాలనీ 10వ వార్డు వార్డు మెంబర్ వేపరాజు కూడా రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రక్తదానం ఎంతో మహత్తరమైన సేవా కార్యక్రమమని, జ్ఞానదానంతో పాటు ప్రాణదానం చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, మురళి, వెంకటేశం, సత్యనారాయణ, ఆనంద్, పాండు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ నగర్‌లో జోగిని నీలిమ ఆధ్వర్యంలో వైభవంగా బోనాల పండుగ

**అమ్మవారి భక్తిలో జోగిని నీలిమ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ**

**సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకున్న నీలిమ.. భక్తులతో మార్మోగిన రాజీవ్ గాంధీ నగర్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 24:** రాజీవ్ గాంధీ నగర్‌లో ఆదివారం జోగిని నీలిమ ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బోనాల పండుగలో భాగంగా జోగిని నీలిమ సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారి భక్తి భావాన్ని ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శన నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నారు. డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ నీలిమ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి, సంప్రదాయం, సంస్కృతి కలగలిసిన ఈ వేడుకలతో రాజీవ్ గాంధీ నగర్ పండుగ శోభను సంతరించుకుంది.

# రాజీవ్ గాంధీ నగర్‌లో ఘనంగా బోనాలు.. సుజాతక్క ఆధ్వర్యంలో వైభవం

**- అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించిన మాజీ కార్పొరేటర్ గాజుల సుజాతక్క**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 24:** కుతుకుల్లాపూర్ నియోజకవర్గంలోని రాజీవ్ గాంధీ నగర్‌లో 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గాజుల సుజాతక్క ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా బోనం ఎత్తి సమర్పించిన సుజాతక్క. రాజీవ్ గాంధీ నగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం మహిళలతో కలిసి ఉత్సాహంగా బోనాల వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా గాజుల సుజాతక్క మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని, రాజీవ్ గాంధీ నగర్ ప్రజలందరూ ఆనందంగా, ఐకమత్యంతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.బోనాల వేడుకల్లో మహిళల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి వచ్చిన అతిథులు, మహిళలు, స్థానిక ప్రజల కోసం సుజాతక్క ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. దీంతో బోనాల వేడుకలు భక్తి, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.



# చౌటుప్పల్ హైవే బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

**• బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్**







**తొలి అక్షరం/చౌటుప్పల్:ఆగష్టు 24:** చౌటుప్పల్ పట్టణ పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను అధికారులు వేగవంతం చేసి, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, వలిగొండ, మునుగోడు, నారాయణపూర్, ధర్మోజిగూడెం, గుజ్జ తదితర ప్రాంతాల ప్రజలు కూడా చౌటుప్పల్‌కు చేరుకునేందుకు ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. బ్రిడ్జి, రోడ్డు పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగి ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని, నిర్మాణ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణ ప్రాంతంలో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, సంబంధిత ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు, నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రజల ఇబ్బందులను ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి**

చౌటుప్పల్‌లో జరుగుతున్న బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించేందుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటివరకు రాకపోవడం దురదృష్టకరమని సుర్వి యాదయ్య గౌడ్ విమర్శించారు. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీకే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను స్వయంగా పరిశీలించి, పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు, పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ ఆర్డీఓకు అందజేసిన వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, మునుగోడు బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షులు నల్పరాజు రమేష్, మండల నాయకులు బోయ శ్రీరాములు, ధర్మోజిగూడెం గ్రామ అధ్యక్షులు బత్తుల సింహాద్రి, నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం, గుజ్జ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తయ్య, నాయకులు పొట్ట జంగయ్య, సుర్వి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్ జడ్జిగా రాచర్ల శాలిని పదోన్నతి

**చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు.**

**14 రోజుల సేవలోనే న్యాయవాదుల మన్ననలు పొందిన జడ్జి**





**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగష్టు 24:** చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించిన రాచర్ల శాలిని సబ్ జడ్జిగా పదోన్నతి పొంది హైదరాబాద్‌కు వెళ్తున్న సందర్భంగా చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి రాచర్ల శాలిని మాట్లాడుతూ.. చౌటుప్పల్ కోర్టులో కేవలం 14 రోజులు మాత్రమే విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తుండటం బాధగా ఉందన్నారు. చౌటుప్పల్ బార్ అసోసియేషన్ సభ్యులు అందించిన సహకారం, ఆదరణను ఎప్పటికీ మరువలేనని తెలిపారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్ మాట్లాడుతూ.. కేవలం 14 రోజులు మాత్రమే విధులు నిర్వహించినప్పటికీ రాచర్ల శాలిని చక్కటి పని చాతుర్యంతో అందరి మన్ననలు పొందారని అన్నారు. తక్కువ సమయంలోనే పలు కేసులను పరిష్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పిట్టల బిక్షమయ్య, సహాయ కార్యదర్శి మక్కాల నరసింహ, స్పోర్ట్స్ సెక్రెటరీ దేశగొని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు నకరికంటి జ్యోతి, ఎండి ఖయ్యూం పాషా, పిల్లలమర్రి కిరణ్, మాజీ అధ్యక్షులు ఎలమొని శ్రీనివాస్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం వెంకట చలపతి, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, రాధాకృష్ణరావు, కానుగుల వెంకటయ్య, రాపోలు వేణు, జల్లా రమేష్, జక్కర్తి శేఖర్, చామట్ల జంగయ్య, గంగాదేవి రవీందర్, రాఘవేంద్ర, భరత్ చంద్ర, మల్లికార్జున్ పాల్గొన్నారు.

# ఉద్యోగులు సాలరీ బ్యాంక్ అకౌంట్ ద్వారా లభించే ప్రయోజనాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి...

**సాలరీ అకౌంట్ ద్వారా లభించే భీమా, బ్యాంకింగ్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలి**

**సహజ మరణానికి రూ.10 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.1 కోటి, విమాన ప్రమాదానికి రూ.1.60 కోట్ల వరకు భీమా రక్షణ**

**శాశ్వత పూర్తి వైకల్యానికి రూ.1 కోటి, పాక్షిక వైకల్యానికి రూ.80 లక్షల వరకు భీమా కవరేజ్**

**ప్రతి ఉద్యోగి తన ఎస్‌బీఐ ఖాతాను ఎస్జీఎస్పి ఖాతాగా కొనసాగుతోందో లేదో పరిశీలించుకోవాలి**

**శాలరీ అకౌంట్ లాభాలపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు**





**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:** ప్రభుత్వ ఉద్యోగులకు సాలరీ బ్యాంక్ అకౌంట్ ద్వారా అందుతున్న భీమా, బ్యాంకింగ్ తదితర ప్రయోజనాలపై ప్రతి ఉద్యోగి పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగులకు సాలరీ అకౌంట్ ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బ్యాంకులతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఉద్యోగుల సాలరీ అకౌంట్ లకు భీమా ప్రయోజనాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఉద్యోగి విధి నిర్వహణలో ఉండగా సహజ మరణం సంభవిస్తే రూ.10 లక్షల వరకు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1 కోటి వరకు, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.1.60 కోట్ల వరకు భీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. శాశ్వత పూర్తి వైకల్యానికి రూ.1 కోటి వరకు, శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.80 లక్షల వరకు భీమా కవరేజ్ అందుబాటులో ఉందని వివరించారు.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ (ఎ+ఎ)లో ఉద్యోగుల నికర నెలవారీ వేతనం ఆధారంగా రోడియం, ప్లాటినం, డైమండ్, గోల్డ్, సిల్వర్ అనే ఐదు కేటగిరీలు ఉన్నాయని తెలిపారు. రూ.2 లక్షలకు పైగా వేతనం పొందే వారికి రోడియం, రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ప్లాటినం, రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు డైమండ్, రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు గోల్డ్, రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం పొందే వారికి సిల్వర్ కేటగిరీలు వర్తిస్తాయని వివరించారు.**ఉన్నత విద్య, బాలిక వివాహ ప్రయోజనాలు**సాలరీ అకౌంట్ ద్వారా ఉన్నత విద్యకు రూ.10 లక్షల వరకు, బాలిక వివాహానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం అందుబాటులో ఉందని తెలిపారు. బాలిక వివాహ ప్రయోజనం 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల గరిష్టంగా ఇద్దరు బాలికలకు వర్తిస్తుందని వివరించారు.బ్యాంకింగ్ సౌకర్యాల్లో భాగంగా లాకర్ ఛార్జీలపై 50 శాతం రాయితీ, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు, నెలకు 25 లీవుల మల్టీ-సిటీ చెక్‌బుక్, రూ.50 వేల థ్రెషోల్డ్‌తో ఆటో స్వీప్ సదుపాయం, నిర్దిష్ట సేవలపై ఉచిత ఛార్జీలు, డీడీ/ఆర్‌టీజీఎస్/నెఫ్ట్ ద్వారా నాలుగు రెమిటెన్స్‌ల వంటి ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు.రూపే డెబిట్ కార్డు ద్వారా అర్హత కలిగిన ఉద్యోగులకు దేశీయ విమానాశ్రయ లాంజ్ సదుపాయం, అంతర్జాతీయ లాంజ్ సదుపాయం, మేక్‌మై ట్రిప్‌పై 10 శాతం రాయితీ, వార్షిక ఆరోగ్య పరీక్ష, అర్హత కలిగిన ఉన్నత కేటగిరీ కార్డులకు ఒక సంవత్సరం అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ వంటి అదనపు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్డు ద్వారా రూ.10 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద, వైకల్య బీమా, రూ.1 కోటి వరకు విమాన ప్రమాద బీమా కూడా లభిస్తుందని వివరించారు.ఈ సమావేశంలో ఎస్‌బీఐ ఆర్‌బీఓ చీఫ్ మేనేజర్ రామ్ బరణ్, ఎల్డిఎం రవి ప్రసాద్, ఎస్‌బీఐ జెడ్‌పీ బ్రాంచ్ మేనేజర్ ఇబ్రహీం, రోటరీ నగర్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ గౌతమి, ట్రెజరీ బ్రాంచ్ మేనేజర్ సునీత, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాల్లో ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమం: మంత్రి కొండా సురేఖ

**వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి**

**మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి**

**ఖమ్మం జిల్లాలో 31.30 లక్షల లక్ష్యానికి గాను 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యం పూర్తి**

**ఆగస్టు 25న మంగళవారం ఖమ్మం జిల్లాలో ఒకే రోజు లక్ష మొక్కలు నాటేలా కార్యాచరణ**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటే ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను, డిఎఫ్ఓ లను ఆదేశించారు.వన మహోత్సవ కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఎఫ్ఓలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా






16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు.
తక్కువ ప్రగతి సాధించిన జిల్లాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 9 శాతం లక్ష్యం మాత్రమే పూర్తయిందని, హెచ్ఎండీఏ, సూర్యాపేట, 3 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, సంగారెడ్డి ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువ లక్ష్యం పూర్తయిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వేగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.వన మహోత్సవంలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. మొక్కల మనుగడ శాతం అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలని అన్నారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల పరిస్థితిపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మంగళవారం 1 లక్ష మొక్కలు నాటే లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. మండలాల వారీగా స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని డిఎఫ్ఓకు సూచించారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అన్ని వర్గాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ బి. శిరీష, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి...

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:** ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.వేంసూరు మండలం లింగపాలెం ఎస్సి కాలనీ వాసులు గ్రామపంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టుట కొరకు గ్రామ పంచాయతీ రోడ్డు ఇరువైపుల డ్రైనేజీ లను పూడ్చివేశారని, డ్రైన్ లో అక్రమంగా బోరు వేసారని, ఈ పరిస్థితులకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా,





తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం వైఎస్సార్ నగర్ కాలనీ కు చెందిన కాలనీ వాసులు అంబేద్కర్ విగ్రహం ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు ఆగస్టు 23న అర్ధరాత్రి సేవా లాల్ విగ్రహం పెట్టడం జరిగిందని, గొడవలు అయ్యే అవకాశం ఉన్నదని, ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన అశోక్ తాను ఆధార్ ఆపరేటర్ సూపర్వైజర్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఉన్నానని, తనకు ఆధార్ సేవలు అందించేందుకు వీలుగా అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈడీఎం కు రాస్తూ పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు...

**వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు**

**అక్రమ విద్యుత్ కనెక్షన్లు, అధిక శబ్దం, రోడ్ల ఆక్రమణలకు తావు ఇవ్వద్దు**

**నిమజ్జన పాయింట్ల వద్ద నీటి లభ్యతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి**

**గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:** వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమని,







గణేష్ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అనుమతులు నిబంధనల మేరకు అందిస్తామని తెలిపారు.ప్రతి గణేష్ మండపానికి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మండపాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, పూర్తి రోడ్డు ఆక్రమించేలా మండపాలు ఏర్పాటు చేయరాదని సూచించారు.వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయరాదని అన్నారు. అనవసరంగా భారీ సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు.ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో గణేష్ నిమజ్జనానికి అవసరమైన నీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలి, ఎలా నిల్వ చేయాలి అనే అంశాలపై ముందుగానే చర్యలు ప్రారంభించాలని, నీటి నిల్వ సాధ్యం కాని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్ కుమార్, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ దోవెలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 19,20 తేదీలలో ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశాలు

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:**ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 19,20 తేదీలలో బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయాలో జరుగుతాయని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.అదే విధంగా అక్టోబర్ 28న ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు దేశవ్యాపిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రైల్వే రాయితీ పునరుద్దరణ తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 19,20 తేదీలలో బోధ్ గయాలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అధ్యక్ష,కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు గోపాల్ మిశ్రా అధ్యక్షతన బోధ్ గయాలో జరిగే ఈ రెండు రోజుల జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ఆయా రాష్ట్రాల సమస్యలు, జాతీయ స్థాయి జర్నలిస్టుల సమస్యల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని మామిడి సోమయ్య తెలిపారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు తదితర అంశాలపై జాతీయ సమావేశాలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని, అదేవిధంగా అక్టోబర్ 28న ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగే నిరసన ప్రదర్శన కు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులను తరలిస్తామని అన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తాం: కంటెంట్ కార్పొరేటర్ ఇక్రాన్

- **హైదర్‌నగర్ సర్వే నంబర్ 65లోని భూమి ప్రజలకే ఉపయోగపడాలి**
- **ప్రభుత్వ భూమిని వేలం వేయడం సరికాదు.. ప్రజల హక్కులను కాపాడుతాం**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 24:** హైదర్‌నగర్: హైదర్‌నగర్ పరిధిలోని సర్వే నంబర్ 65లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రజల అవసరాల కోసం కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని కంటెంట్ కార్పొరేటర్ ఇక్రాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 15 సంవత్సరాలుగా ప్రజల ఉపయోగంలో ఉన్న పార్క్, మైదానం తదితర ప్రాంతాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ప్రభుత్వ భూమిని వేలం వేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని, ప్రజలకు ఉపయోగపడుతున్న స్థలాన్ని ప్రజల అవసరాలకే వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ప్రజల హక్కుల కోసం స్థానికులతో కలిసి తాము చేస్తున్న పోరాటం ఫలితంగా హైకోర్టు నుంచి వచ్చిన ఊరట ప్రజా పోరాటానికి నైతిక విజయమని కంటెంట్ కార్పొరేటర్ ఇక్రాన్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి అని, దాన్ని కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. హైదర్‌నగర్ ప్రజల ప్రయోజనాల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు.

# కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి ప్రచారానికి చెక్!

**- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కాంక్రీట్ నాణ్యతపై కీలక నివేదిక**



**తొలి అక్షరం/చౌటుప్పల్. ఆగస్టు 24:** కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించిన కాంక్రీట్ క్వాలిటీ పరీక్షల్లో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలోని అన్ని పియర్స్‌లో కాంక్రీట్ నాణ్యత చాలా బాగున్నట్లు తేలిందని వెల్లడించింది.బ్యారేజీలలోని కాంక్రీట్ నాణ్యతను పరిశీలించిన కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ ఎక్కడా చిన్న లోపం కూడా గుర్తించలేదని, కాంక్రీట్ నాణ్యత 100 శాతం సంతృప్తికరంగా ఉన్నట్లు స్పష్టం చేసినట్లు సమాచారం.అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కాంక్రీట్‌పై కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇచ్చిన నివేదికతో కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న రాజకీయ ప్రచారానికి చెక్ పడిందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.కేంద్ర సంస్థ నివేదికతో కాళేశ్వరం బ్యారేజీల నాణ్యతపై కొత్త చర్చకు తెరలేచింది.

# దానయ్య హత్య కేసును ఛేదించిన చౌటుప్పల్ పోలీసులు

**- భార్య శారద, అన్న కొడుకు శివే హత్యకు కారణం**





**తొలి అక్షరం/చౌటుప్పల్.ఆగష్టు. 24:** యాదాద్రి భువనగిరి జిల్లా: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలోని శనిగల గుట్ట వద్ద జరిగిన రావుల దానయ్య హత్య కేసును చౌటుప్పల్ పోలీసులు ఛేదించారు.కేసుకు సంబంధించిన వివరాలను చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. మృతుడు దానయ్య భార్య శారద, దానయ్య సొంత అన్న కుమారుడు శివతో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయింది.దానయ్య భార్య శారదకు, శివకు గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే దానయ్యను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. శారదకు మరికొందరితోనూ అక్రమ సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు.ఈ కేసులో నిందితులైన శివ, శారదలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించారు.

# చందూలాల్ జన్మదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సేవా కార్యక్రమం

**• పారిశుద్ధ్య కార్మికులకు టిఫిన్ బాక్సులు, పండ్ల పంపిణీ**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు24:** కాంగ్రెస్ నాయకులు జమాల్పూర్ చందూలాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ 18వ వార్డు భాగ్యనగర్ కాలనీలో సేవా కార్యక్రమం నిర్వహించారు. 18వ వార్డు బీసీ జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు టిఫిన్ బాక్సులు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. వారి శ్రమను గుర్తించి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య కార్మికుల సేవలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మేకల వెంకటేష్, ఎస్పై నరసింహులు నాయక్, రాజేంద్రకుమార్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

# అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి...

**నోటీసులు జారీ చేసే సమయంలోనే**
**అవసరమైన పత్రాలపై ఓటర్లకు**
**అవగాహన కల్పించాలి**
**ఎస్ఐఆర్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**
**నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో**
**పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:** అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు కలిపి సుమారు 1.75 లక్షల నోటీసులు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్ చేసినట్లు వివరించారు. అనామలీస్ క్రింద సుమారు 80 వేల మంది ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన ఓటర్లను విచారణకు పిలిచేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. నోటీసులు జారీ చేసే సమయంలోనే సంబంధిత ఓటర్లు విచారణకు హాజరయ్యే సమయంలో సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఎస్ఐఆర్ ప్రక్రియపై మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.

వీడియో సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని తెలిపారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫోటోతో సహా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, డీటీ అన్సారీ, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘ నాయకులపై కేసులు సరికాదు

**జీవో 97 రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలి**

**విద్యార్థుల నిరసనను నేరంగా పరిగణించడం సరికాదు: జంగయ్య**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు24:** ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును నేరంగా పరిగణించడం సరికాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య అన్నారు. విద్యార్థి సంఘ నాయకులపై షాద్‌నగర్ పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 97తో పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనకు ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాశ్ నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకుడు శ్రీకాంత్, బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. లింగారెడ్డిగూడ చౌరస్తా వద్ద విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. జీవో 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగితే ప్రభుత్వం వెంటనే దాన్ని రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జంగయ్య డిమాండ్ చేశారు.

# పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి

**మండలంలో ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..**

**అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**




**తొలి అక్షరం/పెద్దవంగర ఆగస్టు 24:** పెద్దవంగర మండలంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలు, పారదర్శకతతో పాటు ప్రభుత్వ పథకాల అమలు మరింత సులభతరం అవుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగు మురళి. మాజీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ సర్పంచ్ పారిజాతం. స్థానిక తహసీల్దార్ ఎంపీడీఓ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రవీందర్ రెడ్డి. సైదులు. శ్యామ్. వేణు. నరేష్. అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ట్రిబ్యునల్ మెంబర్ నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్





**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఈదునూరి యాకయ్య వారి సోదరీమణి(ఇయ్యంపురాలు) మాసాని మరియమ్మ యాకూబ్ ఉదయం మృతి చెందడం బాధాకరం. విషయం తెలుసుకున్న తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ వారి గ్రా:ఏనుగల్లు మం: పర్వతగిరిలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్ , టీఎస్ఎంఆర్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య , బిఆర్ఎస్ నాయకులు పొడిశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు. మాసాని మరియమ్మ వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకోవడం జరిగింది.



## ఓనిలా ఫంక్షన్‌లో చిన్నారులను ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి

**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అమీన్ పేట గ్రామ వాస్తవ్యులు గై శోభన్ బాబు -స్వప్న ల కూతుర్లు శ్రీనిక -సిరి ల మరియు వారి కుమారుడు మనిష్ కి దోతి కట్టించుట నూతన వస్త్ర ఫలపుష్పలంకరణలో పాల్గొన్న పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి,రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, నెక్కొండ మండల కాంగ్రెస్ నాయకులు గరికపాటి కృష్ణ రావు, ఇండ్ల రవీందర్ డాక్టర్ కుమారస్వామి, మహ్మద్ కన్నా భాయ్ తదితరులుపాల్గొన్నారు.

# బీసీ కులగణనతోనే సామాజిక న్యాయం: అందె మోహన్

**• కులగణన జరిగే వరకు బీసీల పోరాటం ఆగదు: అందె మోహన్**




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు24:** బీసీల సమగ్ర కులగణన జరిగే వరకు పోరాటం ఆగదని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. హైదరాబాద్‌లో "బీసీల కులగణన జరిగితేనే బీసీలకు న్యాయం జరుగుతుంది" అనే నినాదంతో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. షాద్‌నగర్ నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, కావలి కృష్ణ, కౌన్సిలర్లు ప్రవీణ్, బచ్చలి నరేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అందె మోహన్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. రాహుల్ గాంధీ బీసీల హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడుతున్నారని తెలిపారు. బీసీల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులు కులగణనతోనే స్పష్టమవుతాయని, ఆ వివరాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల కులగణన కోసం స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కులగణనతోనే బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

# సారీ ఫంక్షన్ వేడుకల్లో చిన్నారిని ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామ వాస్తవ్యులు సూరం సౌజన్య బుచ్చిరెడ్డి ఏకైక పుత్రిక రితిక్ష రెడ్డి నూతన వస్త్ర ఫలపుష్పలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, అలంకానిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంపెల్లి శ్రావణ్, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఆకుల ఉప్పలయ్య, చిదరాల నరేష్ లక్కాకుల యాకయ్య, మట్టపెల్లి రమేష్, సూరం బుచ్చిరెడ్డి, సొల్లేటి జగన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రజావాణికి ప్రజల నుండి 9 దరఖాస్తులు



**తొలిఅక్షరం/నెల్లికుదురు ఆగస్టు 24:** నెల్లికుదూరు మండల స్థానిక కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుంది. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎమ్మార్వో నరేష్ ఎంపిడిఓ సింగారపు కుమార్ పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యల తో వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజావాణికి మండల వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం మొత్తం తొమ్మిది దరఖాస్తులు అందజేసినట్లు ఎంపీడీవో సింగారపు కుమార్ చెప్పడం జరిగింది. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు ఏ శాఖ నుండి వచ్చినవి ఆ శాఖ వారు దరఖాస్తులు తీసుకొని వెంటనే పరిష్కరించాలని ఆ శాఖల అధికారులను కోరడం జరిగింది. ప్రజావాణినీ మండలంలో ఉన్న ప్రజలు సద్వినియం చేసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలోవివిధ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం గ్రామంలో ఘనంగా బోనాల పండుగ

**- బోనం ఎత్తుకున్న గ్రామ సర్పంచ్ బద్దం యాదమ్మ యాదగిరి**



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 24:** రామన్నపేట మండలం కొత్తగూడెం గ్రామంలో ఘనంగా మారమ్మ-పాపమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలతో బెల్లం నైవేద్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్దం యాదమ్మ యాదగిరి ఉపసర్పంచ్ నీల ఆంజనేయులు వార్డు మెంబర్లు జావదీ కిషోర్ కోయగూరి సరిత నీల రేణుక భీమకాని అంజమ్మ అంబటి రాజేశ్వరి పొట్ట సుగుణమ్మ బాత్క. సైదులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని మారెమ్మ -పాపమ్మ తల్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించి గ్రామాన్ని చల్లగా చూడాలని పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు.

# ఇబ్రహీం మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటు

**● నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం**



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 24:** పాత్రికేయ రంగానికి సీనియర్ జర్నలిస్టు ఎండి ఇబ్రహీం మృతి తీరనిలోటు అని నకరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. సోమవారం రామన్నపేట పాత్రికేయ బృందవ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇబ్రహీం సంతాప సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు పాత్రికేయ రంగంలో 50 సంవత్సరాలు పైగా ఒకే పత్రికలో పనిచేసిన గొప్ప వ్యక్తి ఎంపీ ఇబ్రహీం అని కొనియాడారు. ఎవరితోనూ విభేదాలు లేకుండా అందర్నీ కలుపుగోలుగా కలుపుకొని అందరి మండల లో పొందిన వ్యక్తి ఇబ్రహీం ఒక్కరేనని అన్నారు. 2018 నుండి తనకు ఎంతో సానిహితంగా ఉంటూ ఎప్పటికప్పుడు తనతో మాట్లాడుతూ పలు సమస్యలపై చర్చించేవారు అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. సీనియర్ పాత్రికేయ రంగంలో ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తు పాత్రికేయ రంగంలో నిబద్ధత కలిగిన వ్యక్తి ఇబ్రహీం ఒక్కరేనని కొనియాడారు. ఆయన మృతి ప్రతి ఒక్కరికి తీరనిలోటని ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పున్న జగన్మోహన్,సిరిగి రెడ్డి మల్లారెడ్డి, ఎండి జమీరుద్దీన్, గంగుల వెంకట రాజారెడ్డి, పూస బాలకిషన్, పోచబోయిన మల్లేశం, ఉట్కూరి నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, వనం చంద్ర శేఖర్, మీర్జా ఫజల్ బేగ్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి రెహాన్, ఎండి అక్రమ్, మిర్యాల మల్లేశం, సాల్వేర్ అశోక్, కందుల హనుమంతు, మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించిన అధికారులు



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 23:**రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు దరఖాస్తులు రావడం జరిగినది ఆ రెండు దరఖాస్తులు రెవెన్యూ శాఖకు చెందిన దరఖాస్తులుగా అధికారులు గుర్తించినారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ. రాములు ఎమ్మార్వో సి. లాల్ బహదూర్ శాస్త్రి ఎంపీ ఓ. ఎండి రఫీ ఎంఈఓ టీ.సురేందర్ రెడ్డి ఆర్ అండ్ బి ఏ ఈ బి.నవీన్ ఫారెస్ట్ అధికారి కళ్యాణి వెటర్నరీ అధికారి జ్యోత్స్న అంగన్వాడి అధికారులు సుజాత ధనమ్మ మెడికల్ అధికారి అనిత అగ్రికల్చర్ అధికారి ఎజాజ్ అలీ ఖాన్ బీసీ వెల్ఫేర్ వార్డెన్ జ్యోతి ఎలక్ట్రిసిటీ అధికారి నటరాజ్ ఇరిగేషన్ ఏఈ రాజేశ్వరి ఫైర్ అధికారులు ఏ కృష్ణ డి దిలీప్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఆశిష్ రాఘవ ఏపిఎం జానీ ఆర్టికల్చర్ అధికారి నరసింహ ఏఎస్ఐ సురేందర్ ఎక్సైజ్ అధికారి సోనీ హౌసింగ్ ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేబుల్ ఛానళ్ళ సమస్యలు పరిష్కరించండి

**-ఐపీ టీవీలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి**

**-మీడియా అకాడమీ ఛైర్మెన్ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు -24:** రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నాయకత్వంలో పలువురు కేబుల్ ఛానళ్ళ నిర్వాహకులు, ఫెడరేషన్ నాయకులు సోమవారం తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి కేబుల్ ఛానళ్ళ అక్రెడిటేషన్ కార్డుల సమస్య పై చర్చించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో కేబుల్ నెట్వర్క్ ద్వారా నడుస్తున్న కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, దీనివల్ల ఆయా ఛానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి కొన్నేళ్ళుగా నడుపుతున్న కేబుల్ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో అన్యాయం చేయడం తగదని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం లేకపోయినప్పటికీ జర్నలిజం పట్ల వారికున్న మక్కువతో కష్ట నష్టాలకోర్చి నడుపుతున్న కేబుల్ ఛానళ్ళకు ప్రభుత్వం ఇచ్చే ఏకైక అక్రెడిటేషన్లు కూడా సరిగా ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో చాలా కేబుల్ నెట్వర్క్ సంస్థలు కొత్త టెక్నాలజీతో ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) నెట్వర్క్ ద్వారా న్యూస్ ఛానళ్ళను నడుస్తున్నాయని, సీనియారిటీ ఉన్న ప్రతి కేబుల్ ఛానల్ తో పాటు అన్ని అర్హతలున్న కొత్త ఛానళ్ళకు, ఐపీ ఆధారిత న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య కోరారు.కేబుల్ ఛానళ్ళ సంఖ్య, జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేబుల్ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు తగ్గించకుండా,కనీసం గతంలో ఇచ్చిన మాదిరిగా, జిల్లాకు 4, రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి అన్నారు. ఇప్పటికే అన్ని అర్హతలతో అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న కేబుల్ ఛానళ్ళకు వెంటనే కార్డులు ఇవ్వాలని, ఐపీ నెట్వర్క్ లో నడుస్తున్న న్యూస్ ఛానళ్ళను కూడా గుర్తించి అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం వారు ఛైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్ ఎస్. రవికుమార్, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, వెంకట్, కుమారస్వామి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం ప్రాతినిధ్యం ఇవ్వాలి

**- ఓట్లు బీసీలవి.. పదవులేమో ఒకే సామాజిక వర్గానికా?**

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 24:** త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత, పదవులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పదవుల్లోనూ ఒకే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత లభిస్తోందని, బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మిగిలిపోతున్నారని విమర్శించారు. పేరుకే సామాజిక న్యాయం అని చెప్పడం కాకుండా, పదవుల పంపిణీలోనూ సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు బీసీలను పార్టీలో నుంచి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీలకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. బీసీల జనాభా, రాజకీయ భాగస్వామ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కనీసం 50 శాతం నామినేటెడ్ పదవులు బీసీలకు కేటాయించాలని ఆయన కోరారు.

# చిన్నకొర్పోల్ గ్రామంలో గీతా కార్మిక (గౌడ) సంఘ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నిక



- అధ్యక్షులు గంగపురి చంద్రమౌళి గౌడ్,



ఉపాధ్యక్షులు కొయ్యడ రాజు గౌడ్, - కోశాధికారిగా కొయ్యడ అనిల్ కుమార్ గౌడ్




**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కొర్పోల్ గ్రామంలో నూతనంగా ఎన్నుకోబడిన గౌడ సంఘ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మరియు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గ్రామంలో గౌడ కులస్తుల సంఘం గతసంవత్సరంలోని పెద్దమనుషుల దిగి పోవడంతో నూతనంగా అధ్యక్షులుగా గంగపురి చంద్రమౌళి గౌడ్,ఉపాధ్యక్షుడు కొయ్యడ రాజు గౌడ్, కోశాధికారి గా కొయ్యడ అనిల్ కుమార్ గౌడ్, ఎన్నుకోవడం జరిగింది. గౌడ సంఘం సారు కొల్ల గౌడ్ గంగపురి వెంకన్న గౌడ్, మాజీ అధ్యక్షులు చింతల వేణుగోపాల్ గౌడ్, చిన్న కొర్పోల్ గ్రామ సర్పంచ్ బానోతు అనిత- బద్రు నాయక్, బొట్టు పెద్దమనిషి కొయ్యడ సాంబమూర్తి గౌడ్, కొయ్యడ బిక్షం, కొయ్యడ పెద్ద వెంకన్న, పులి శ్రీనివాస్, కొయ్యడ వెంకన్న, గంగపురి రవి, కొయ్యడ సంతోష్ , చింతల వీరస్వామి, చింతల వెంకన్న, చింతల సతీష్, కొయ్యడ సంతోష్ సన్నఫ్ పాపయ్య గౌడ కులస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులపై రాజకీయ ప్రచారం బంద్ చేయాలి:బీజేపీ జనగామ జిల్లా ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు సాయి ప్రసన్న చారి


**తొలి అక్షరం /కొడకండ్ల ఆగస్టు 24:**తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు ముద్రించడాన్ని బీజేపీ జనగామ జిల్లా ఓ బి సి మోర్చా కార్యవర్గ సభ్యులు సాయి ప్రసన్న చారి తీవ్రంగా ఖండించారు. ప్రజాధనాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ సొంత ప్రచారానికి వాడుకోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు .ఈ సందర్భంగా సాయి ప్రసన్న చారి మాట్లాడుతూ రాష్ట్రంలో పంపిణీ చేసే ఉచిత రేషన్ బియ్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వమే అత్యధిక నిధులు కేటాయిస్తోంది, నిధులు ఇచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను విస్మరించి, కేవలం కాంగ్రెస్ నాయకుల ఫోటోలను ప్రదర్శించడం ఏ రకమైన న్యాయం? వందల కోట్ల ప్రజాధనంతో స్మార్ట్ కార్డుల పేరిట సొంత ప్రచారం చేసుకోవడం పట్ల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి అని కోరారు. అలాగే కార్డులపై నాయకుల ఫోటోల ముద్రణ వల్ల అనవసరమైన రీ-ప్రింటింగ్ ఖర్చులు పెరుగుతాయని, ప్రభుత్వం ఇటువంటి పబ్లిసిటీ స్టంట్లను స్వస్తి చెప్పి ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అనవసర ఖర్చులను అరికట్టి, రేషన్ కార్డులపై నాయకుల ఫోటోలు లేకుండా సాధారణ కార్డులు పంపిణీ చేయాలని కోరారు.

# గ్రామంలో నివాసం తప్పనిసరి.. నిబంధనలు పాటించని కార్యదర్శులపై చర్యలేవి?




**తొలి అక్షరం/ఏన్కూర్ ఆగస్టు 24:** గ్రామపంచాయతీ కార్యదర్శులు తాము విధులు నిర్వహిస్తున్న గ్రామంలోనే నివాసం ఉండాలనే నిబంధన అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 43(8) ప్రకారం గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామంలోనే నివాసం ఉండి విధులను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీ తీర్మానాల అమలు, పారిశుద్ధ్య పర్యవేక్షణ, సిబ్బంది హాజరు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు కార్యదర్శిపై ఉంటాయి. అయితే, కొందరు కార్యదర్శులు తాము విధులు నిర్వహిస్తున్న గ్రామాల్లో నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయపాలన పాటించకపోవడం, విధులకు ఆలస్యంగా హాజరవడం, కొన్ని సందర్భాల్లో గైర్హాజరు కావడం వంటి అంశాలపై గ్రామ ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అంతేకాకుండా కార్యదర్శి స్వయంగా నిర్వహించాల్సిన కొన్ని బాధ్యతలను మల్టీపర్పస్ వర్కర్లతో చేయిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉండాల్సిన నిబంధనను ఉల్లంఘించినట్లు, విధులకు గైర్హాజరవుతున్నట్లు లేదా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంలేదని ఆధారాలతో నిర్ధారణ అయితే సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. హాజరు రికార్డులు, బయోమెట్రిక్ వివరాలు, విధుల నిర్వహణ, గ్రామంలో నివాసం ఉంటున్నారా లేదా అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించి, వర్తించే సర్వీస్, క్రమశిక్షణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో నివాసం తప్పనిసరి అనే నిబంధన కేవలం పుస్తకాలకే పరిమితమైందా? లేక నిజంగా అమలవుతోందా? ఉల్లంఘనలపై అధికారులు చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ఏన్కూరు మండలంలో చర్చనీయాంశంగా మారాయి.

# 51 ఏళ్లు ఒకే గడ్డపై, ఒకే కలంతో సేవ చేసిన ఎండీ ఇబ్రహీం



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 23:** ఈరోజు మనం ఒక రిపోర్టర్ ను కోల్పోలేదు... రామన్నపేట పత్రికా చరిత్రలో ఒక శకాన్ని కోల్పోయాము. 51 సంవత్సరాలు. అంటే ఒక మనిషి జీవితంలో సగభాగం. ఎండీ ఇబ్రహీం 51 ఏళ్లూ ఆంధ్రజ్యోతి కలాన్ని నమ్ముకుని, ఈ రామన్నపేట గడ్డను నమ్ముకుని బతికారు. ఆయన గురించి 4 మాటల్లో చెప్పాలంటే: ఆయన కలం ఎప్పుడూ పేదవాడి పక్షమే ఆయన వార్త రాస్తే అది అధికారికి భయం కాదు, బాధితుడికి భరోసా. కులం, మతం, పార్టీ చూడకుండా నిజాన్ని రాసిన నిఖార్సయిన జర్నలిస్ట్ ఆయన. పోటీని ప్రేమించిన మనిషిమేము పోటీ రిపోర్టర్లమే అయినా, ఆయన మమ్మల్ని ఎప్పుడూ శత్రువుల్లా చూడలేదు. "నోముల శంకర్, నీ వార్త బాగుంది" అని మెచ్చుకునే పెద్ద మనసు ఆయనది. పోటీలో కూడా ప్రేమ ఉండొచ్చు అని ఆయన నేర్పారు. 51 ఏళ్లు ఒకే పేపర్, ఒకే ఊరు – ఇది తపస్సుఈ రోజుల్లో 4 నెలలకో పేపర్ మారే కాలంలో, 51 ఏళ్లు ఆంధ్రజ్యోతిలోనే ఉండటం అంటే అది ఉద్యోగం కాదు, అది ఆ పత్రికపై, ఈ ప్రాంతంపై ఉన్న భక్తి. ఆయన వెళ్లిపోలేదు, మన కలాల్లో బతికి ఉన్నారుఇబ్రహీం చనిపోలేదు. రామన్నపేటలో ఇప్పుడు రాసే ప్రతి చిన్న రిపోర్టర్ కలంలో ఆయన అనుభవం ఉంది. మనం నిజం రాసిన ప్రతిసారీ ఆయన మనతోనే ఉంటారు. చివరగా యువ రిపోర్టర్లకు ఒక మాటమిత్రులారా, మనం బైకుల మీద తిరిగి, వాట్సాప్ లో న్యూస్ పెట్టే రోజుల్లో ఉన్నాం. కానీ ఇబ్రహీం సైకిల్ మీద తిరిగి, కాళ్లరిగేలా తిరిగి వార్త తెచ్చేవారు. టెక్నాలజీ మారింది, కానీ నిజాయితీ మారకూడదు. ఆయన మనకు ఇచ్చిన సందేశం ఒక్కటే కలం అమ్ముకోకు, గడ్డను మరువకుఆ మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనమంతా అండగా ఉండాలని కోరుకుంటూజోహార్ ఎండీ ఇబ్రహీం కి జోహార్. ఇట్లు, తొలి అక్షరం రిపోర్టర్, నోముల శంకర్, రామన్నపేట సెల్. 9701775950

# విజ్ఞాన విహారయాత్ర వండర్లలో సెయింట్ థెరిస్సా హైస్కూల్

**• సెయింట్ థెరిస్సా హై స్కూల్ ప్రిన్సిపల్ & కరస్పాండెంట్ చల్లా మమత- యాకుబ్ రెడ్డి**





**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి సెయింట్ థెరిస్సా హై స్కూల్లో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల విజ్ఞాన విహార యాత్రలో సెయింట్ తెరిస్సా ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ చల్లా మమతయాకూబ్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హైదరాబాద్ లోని వండర్ల విహారయాత్రను పురస్కరించుకొని, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు శాస్త్ర విజ్ఞానంతో పాటు సామాజిక, సంస్కృతిక కార్యక్రమాల పైన అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థిని, విద్యార్థుల యొక్క సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే విధంగా ఉపాధ్యాయ బృందాన్ని విజ్ఞాన విహారయాత్రలో భాగస్వామ్లను చేయడం జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ తెరిస్సా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ & కరస్పాండెంట్ చల్లా మమతయాకూబ్ రెడ్డిల కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఇలాంటి కార్యక్రమాలలో విద్యార్థిని,ఉపాధ్యాయులను భాగస్వాములు చేయడంతో పాటు విజ్ఞాన విహారయాత్రల ను కొనసాగించడం ద్వారా విద్యార్థులలో, అభివృద్ధిని సాధించవచ్చని తెలుపడం జరిగింది.

# కొడకండ్ల మండలంలో లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**తొలి అక్షరం/కొడకండ్ల ఆగస్టు 24:** పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు కొడకండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసిల్దార్ అనిల్ బాబు అధ్యక్షతన అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డివిజన్ ప్రతినిధులు, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్లు పాల్గొని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురేష్ నాయక్ మాట్లాడుతూ... పేదరిక నిర్మూలనతో పాటు అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ ఆహార భద్రత, సంక్షేమ పథకాల ప్రయోజనాలను సకాలంలో సులభంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. డిజిటల్ స్మార్ట్ కార్డుల ద్వారా సబ్సిడీ మరియు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని తెలిపారు. భవిష్యత్తులో కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులు, తొలగింపుల వంటి మార్పులను కార్డులోనే సులభంగా అప్‌డేట్ చేసుకునేలా ఆధునిక డిజిటల్ వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని స్పష్టం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తహసిల్దార్ అనిల్ బాబు మాట్లాడుతూ... కొడకండ్ల మండలానికి మొత్తం 10,823 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామాల వారీగా మంజూరైన కార్డుల వివరాలు: కొడకండ్ల: 2,725, మొండ్రాయి: 1,650, రామవరం: 1,337, ఏడునూతుల: 1,181, లక్ష్మక్కపల్లి: 949, రామన్నగూడెం: 725, రేగుల: 691, పాకాల: 651, రంగాపురం: 540, నరసింహాపురం: 374ఈ కార్యక్రమంలో కొడకండ్ల సర్పంచ్ దూలం మమత–సతీష్, హక్యా నాయక్ తండా సర్పంచ్ బొందమ్మ–చందులాల్, మొండ్రాయి సర్పంచ్ గునిగంటి వెంకటేశ్వర్లు, రామన్నగూడెం సర్పంచ్ యాకూబ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు మరియు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమం చేరువ కావాలె...

**• తొర్రూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
**• హామీల అమలుతో ప్రజల చెంతకే సంక్షేమ పాలన • పారదర్శకంగా నిత్యావసరాలు: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 24:** రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తొర్రూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో వివిధ గ్రామాల అర్హులైన లబ్ధిదారులకు ఆమె స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన ప్రతి హామీని క్రమంగా నెరవేరుస్తూ, నిజమైన ప్రజా పాలనను అందిస్తున్నామని పునరుద్ఘాటించారు. నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది. ఇతర సంక్షేమ పథకాల అమలూ మరింత సులభతరం అవుతుంది. అర్హత ఉండి ఇప్పటికీ రేషన్ కార్డులుందని వారు ఉంటే, వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పంజా కల్పన, వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్. వివిధ గ్రామాల సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ మండల అధికారులు మరియు భారీ సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు.

# ఘనంగా వరంగల్‌లో టోసా - ఒయాసిస్ కాన్2026 ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ లోని కాళోజీ కళాక్షేత్రంలో టోసా – ఒయాసిస్ కాన్ 2026 ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్ ఘనంగా ప్రారంభమైంది. వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీమతి శ్వేత మాట్లాడుతూ...సౌత్ ఇండియా ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్‌ను వరంగల్‌లో నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక సదస్సుకు వరంగల్ నగరం ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. యువతరం వైద్యులకు నిరంతర అభ్యాసం,సాధన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వైద్య రంగంలో సుమారు వెయ్యి గంటల సాధనకు ఎంతో విలువ ఉంటుందని, నిరంతరం నేర్చుకోవడం ద్వారా వైద్యులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోగలరని తెలిపారు. ఇలాంటి సి ఎమ్ ఇ కార్యక్రమాలు సీనియర్ వైద్యులు తమ సుదీర్ఘ అనుభవం,నాలెడ్జ్‌ను యువతరం వైద్యులతో పంచుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సీనియర్ డాక్టర్ల జ్ఞానం,అనుభవం యువ డాక్టర్లకు ఎంతో ఉపయోగపడుతుందని,తద్వారా నూతన తరం వైద్యులు మరింత నైపుణ్యంతో ఎదగడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వరంగల్ నగరం ఇలాంటి ప్రతిష్టాత్మక సౌత్ ఇండియా స్థాయి కాన్ఫరెన్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని,టోసా– ఒయాసిస్ కాన్ 2026 సదస్సు సౌత్ ఇండియా స్థాయిలో ఒక ల్యాండ్‌మార్క్ కాన్ఫరెన్స్‌గా నిలుస్తుందని సీపీ శ్వేత అన్నారు. భవిష్యత్తులో వరంగల్ నగరం మరిన్ని జాతీయ,అంతర్జాతీయ స్థాయి వైద్య సదస్సులకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని,ఇలాంటి కార్యక్రమాల ద్వారా నగరానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఆమె తెలిపారు. డా. పెసరు విజయచందర్ రెడ్డి ఒయాసిస్ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ సదస్సులో భాగంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. పెసరు విజయచందర్ రెడ్డి ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియన్ స్టేట్స్ (ఒయాసిస్) అధ్యక్షుడిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. డా. పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ... ఒయాసిస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తనకు ఎంతో గౌరవంగా,బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని ఆర్థోపెడిక్ సర్జన్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి,వైద్య రంగంలో నూతన సాంకేతికతలు, పరిశోధనలు, ఆధునిక చికిత్సా విధానాలపై జ్ఞానాన్ని పరస్పరం పంచుకునేలా కృషి చేస్తానని అన్నారు. యువతరం ఆర్థోపెడిక్ వైద్యులకు సీనియర్ వైద్యుల అనుభవం,జ్ఞానం అందేలా మరిన్ని సి ఎమ్ ఇ లు,శిక్షణా కార్యక్రమాలు, హాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు,ఆర్థోపెడిక్ వైద్య రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. వరంగల్‌లో టోసా– ఒయాసిస్ కాన్2026(టి ఒ ఎస్ ఎ – ఒయాసిస్ కాన్2026) వంటి ప్రతిష్టాత్మక సదస్సు నిర్వహించడం ద్వారా వరంగల్ నగరానికి,తెలంగాణ రాష్ట్రానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ డా. విజయచందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఒయాసిస్ ఆర్గనైజింగ్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి,ఒయాసిస్ ప్రెసిడెంట్ డా. ఆర్. కృష్ణ గోపాల్,సెక్రటరీ జనరల్ డా. రోషన్ కుమార్,కో–ఆర్గనైజింగ్ చైర్మన్ డా. పి. సుధీర్ కుమార్,ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కాటం రామ్ కుమార్ రెడ్డి,సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డా. మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు మహా ధర్నా నోటీస్ అందజేసిన వరంగల్ ఉద్యోగుల జేఏసీ




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కలెక్టర్ కు మహా ధర్నా నోటీస్ అందజేసిన ఉద్యోగుల జేఏసీ వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ గాజె వేణుగోపాల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్య శారద ఐఏఎస్ కు తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 27వ తేదీన కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో చేయబోయే మహా ధర్నా నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జాక్ నేతలు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్నాయని ముఖ్యంగా పిఆర్సి పాత పెన్షన్ పునరుద్ధరణ పెండింగ్లో ఉన్న ఆరు డి ఎ ల మంజూరు,పూర్తిస్థాయిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు,పెండింగ్ బిల్లుల మంజూరు,తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అందుకొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కొరకు దశలవారీగా కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగానే రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు 27 ఆగస్టు గురువారం నాడు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లతో మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు,అధికారులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు,పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ గౌరవాధ్యక్షులు గజ్జల రామ్ కిషన్,జేఏసీ నాయకులు డీటీఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్ రెడ్డి,గోవిందరావు,టీఎస్ యుటిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తాటికాయల కుమార్,కార్యదర్శి సుజప్రసాద్,టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం,టి ఆర్ టి ఎఫ్ అధ్యక్షులు కిషన్,టీపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అశోక్,ఎస్ జి పి టి సంఘ అధ్యక్షులు సదానందం,పెన్షనర్ల సంఘం బాధ్యులు సారయ్య,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాంబయ్య,భాను ప్రకాష్,సిటీ అధ్యక్షులు శంకేసి రాజేష్,పి ఆర్ టి యు తెలంగాణ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,సెక్రెటరీ ఈశ్వర్ ఎస్టియు అధ్యక్షులు మధు లీమియా,జేఏ సీ బాధ్యులు సుభాష్,నాగరాజు,కుమారస్వామి,గంగాధర్,వినోద్ వెంకటరమణ,యాకుబ్ నాయక్,తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## దేవకన్యలా మెరిసిన మానస వారణాసి..






టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. 'బ్రీజ్' తాకిడికి రెక్కలు విప్పుకున్న అందం: మానస వారణాసి "బ్రషెడ్ బై ది బ్రియాజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. సింపుల్ జ్యువెలరీ.. సోయగం డబుల్: ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' హిట్‌తో ఫుల్ జోష్: మోడలింగ్‌లో రాణించిన మానస వారణాసి, నటనలోనూ తన మార్క్ చూపిస్తోంది. సంతోష్ శోభన్ సరసన ఆమె నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ టాక్ తెచ్చుకోవడంతో ఈ భామ ఫుల్ ఖుషీగా ఉంది. ఇక అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమాతో నటిగా మానస తన స్థానాన్ని మరింత బలంగా సుస్థిరం చేసుకుంది. అందం, అభినయంతో పాటు హుందాతనంతో కూడిన సంప్రదాయ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది మానస వారణాసి. ఇక క్యూట్ అండ్ క్లాసీ ఫోజులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ తెలంగాణ బ్యూటీ, రాబోయే రోజుల్లో తెలుగు చిత్రసీమలో మరిన్ని బిగ్ ఆఫర్లతో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## బోనాల మరుసటి రోజు.. జోగిని నీలిమ ఇంటివద్ద తొట్టెల మహోత్సవం!


**● అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తొట్టెల సమర్పణ.. రాజీవ్ గాంధీ నగర్‌లో ఆధ్యాత్మిక సందడి ● ప్రతి ఏటా తన సొంతంగా నిర్వహిస్తున్న నీలిమ.. భక్తులకు అమ్మవారి ఆశీస్సులు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 24:** రాజీవ్ గాంధీ నగర్:ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్న అనంతరం, సోమవారం రాజీవ్ గాంధీ నగర్‌లో జోగిని నీలిమ తన ఇంటి వద్ద సొంతంగా నిర్వహిస్తున్న తొట్టెల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అత్యంత భక్తిశ్రద్ధలతో తొట్టెలను సమర్పించారు. ఈ సందర్భంగా నీలిమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా జోగిని నీలిమ మాట్లాడుతూ, బోనాల పండుగ అనంతరం అమ్మవారికి తొట్టెలు సమర్పించడం తమకు ఎంతో పవిత్రమైన ఆచారమని తెలిపారు. ప్రతి సంవత్సరం తన సొంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అమ్మవారి ఆశీస్సులతో రాజీవ్ గాంధీ నగర్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. అమ్మవారి కృపతో ప్రతి ఇంటా శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తొట్టెల మహోత్సవం సందర్భంగా భక్తి గీతాలు, పూజా కార్యక్రమాలతో పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అమ్మవారి దర్శనం, తొట్టెల సమర్పణతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

# 100 కోట్ల క్లబ్ దిశగా 'ఇరుముడి'

రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, 'ఇరుముడి' సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.



## వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి

సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు. రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే.



## రాజీవ్ గాంధీ నగర్‌లో తొట్టెల మహోత్సవం.. పోతురాజుల వీర విన్యాసం అదుర్స్!

**యుగేందర్, ప్రణయ్‌ల ఉర్రూతలూగించిన విన్యాసాలు.. పండుగకు ప్రత్యేక ఆకర్షణ**

**-డప్పుల దరువులకు తగ్గట్టుగా పోతురాజుల వీరవిహారం.. ఆకట్టుకున్న భక్తజనం**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 24:** రాజీవ్ గాంధీ నగర్‌లో నిర్వహించిన తొట్టెల మహోత్సవం భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవంలో భాగంగా పోతురాజులుగా యుగేందర్, ప్రణయ్ చేసిన వీర విన్యాసాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల దరువులకు అనుగుణంగా ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, తమదైన శైలిలో విన్యాసాలు ప్రదర్శించిన ఇద్దరూ చూపరులను మంత్రముగ్ధులను చేశారు. వారి ఉత్సాహం, సమన్వయం, అద్భుతమైన ప్రదర్శనతో తొట్టెల మహోత్సవ ప్రాంగణం హోరెత్తింది. యుగేందర్, ప్రణయ్‌ల పోతురాజుల విన్యాసాలను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ సందడి మరింత రెట్టింపైంది.



## 'శుక్రాచార్యుడి యుద్ధరావం'.. ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి అక్షయ్ ఖన్నా ఫస్ట్ గ్లింప్స్

ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా, పూజ కొల్లూరు దర్శకత్వంలో నిర్మాణం బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ చిత్రాన్ని అందిస్తున్నారు. 'మహాకాళి' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రం నుంచి 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో రాక్షసుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నారు.



తాజాగా విడుదల చేసిన ఈ గ్లింప్స్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. »THE END BEGINS» (అంతం మొదలవుతుంది) అనే ట్యాగ్‌లైన్‌తో, గంభీరమైన వాతావరణంలో అక్షయ్ ఖన్నా లుక్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకుంటున్నాయి. హనుమాన్ ప్రపంచానికి కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంలో అసుర గురువు శుక్రాచార్యుడి పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. ప్రశాంత్ వర్మ మార్క్ విజువల్స్, సౌండ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, కాన్సెప్ట్ అందిస్తూ క్రియేటర్‌గా వ్యవహరించగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియా రెడ్డి, రోహిత్ సరాఫ్, సముద్రఖని, నాజర్, మురళీ శర్మ, రజత్ కపూర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు.

ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'హనుమాన్' విజయం తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.